
# కావలసినవాళ్లు

పి.పి. వరప్రసాద రావు

పరీక్షలకి ముందుగానే పేపర్లు లీకయిపోయినట్లు- పబ్లిసిటీకి దూరంగా ఉంచిన మృత్యుంజయుని వివరాలు కూడా ఎక్కడో ఏ వెధవ బలహీనత వల్లనో లీకయిపోయాయి.

పక్క రోజు పత్రికల నిండా అవే వార్తలు!!

ఏ దినపత్రిక చూసినా ఏ పేజీలో చూసినా ఎక్కడో ఓ చోట ఏదో ఓ రూపంలో మృత్యుంజయుని గురించిన విస్మయం కలిగించే వార్తలే!



హెడ్ లైన్లలోను, రంగు రంగుల బాక్స్‌లు కట్టిన అయిటంలలోను....

ఎటు చూసినా మృత్యుంజయుడి గురించిన వార్తలు, విశేషాలు, ఊహా చిత్రాలు....

"ప్రముఖ భారతీయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ భరద్వాజ ఓ నిండు జీవిత కాలం పాటు చేసిన కృషి ఫలితంగా ఓ మృత్యుంజయుడు రూపు దిద్దుకొన్నట్లు వినికిడి. భారతదేశాన్ని పట్టి పీడిస్తున్న అన్ని రకాల రుగ్మతలకీ మూలకారణమైనటువంటి రాజకీయ వ్యవస్థను నమూలంగా ప్రక్షాళనం చేసేందుకు గాను ప్రొఫెసర్ భరద్వాజ ఈ మృత్యుంజయుణ్ణి ఓ క్షిపణిలా ఓ పాశుపతాస్త్రంలా ఓ హ్యూమన్ బాంబ్‌లా ప్రయోగించబోతున్నాడని విశ్వసనీయవర్గాల ద్వారా తెలుస్తోంది.

అంటూ ఆసక్తికరమైన కథనంతో మృత్యుంజయుని గురించిన ఎన్నో ఆశ్చర్యకరమైన వివరాలతో ఓ ప్రముఖ దినపత్రిక ఏకంగా ఫస్ట్ పేజీ మొత్తాన్నే ఆ వివరాలకు కేటాయించేసింది.

ఈ క్రమంలో మృత్యుంజయుడు తన కడ్డుగా నిలిచే వాళ్లని సంహరించడానికి సైతం పూనుకోవచ్చునని.... అవినీతిపరులు, లంచగొండులు ఏ రంగంలో ఉన్నా సరే వాళ్లని పట్టి బంధించి వాళ్ల చీకటి బ్రతుకుల్ని రచ్చకీడ్చడానికి ఏ మాత్రం వెనుకాడబోడని మరో పత్రిక బాక్స్ కట్టి మరీ ప్రచురించింది.

అహరహాలు శ్రమించి ప్రొఫెసర్ భరద్వాజ సృష్టించిన మృత్యుంజయుని పుణ్యమా అని-

ఇక అందలం కోసం అవినీతి కాని;

అధికారం కోసం ప్రాకులాటగాని, చదువులతో వ్యాపారాలు గాని జరగబోవని ప్రచురించింది మరో దినపత్రిక.

ఇంకా రకరకాలుగా రక రకాల దినపత్రికలలో మృత్యుంజయుని గురించిన వివరాలు చదివిన వాళ్ళు విస్మయంలో మునిగి తేలారు.

నిజంగా ఇలాంటి మృత్యుంజయుణ్ణి సృష్టించడం సాధ్యమేనా!? అని అనుమానపడ్డారు కొందరు.

ఇంకా ఇలాంటి శాస్త్రవేత్తలు బ్రతికున్నందుకు మనం భారతీయులంగా ఎంతో గర్వపడాలి అంటూ ఉప్పొంగిపోయారు జాతీయ భావం ఉరకలెత్తేవాళ్లు.

పేపర్లో వేసినట్లే అంతా జరిగితే భారత దేశానికి ఇక మళ్లీ స్వర్ణయుగమే అన్నారు మరి కొంతమంది.

ఆ నెల రోజులూ ఏదో ఓ రూపంలో మృత్యుంజయుని గురించిన వివరాల్ని పత్రికలు ఆసక్తిగా శ్రద్ధగా ప్రచురిస్తూనే వచ్చాయి.

చెరువుకి కొత్త నీరొచ్చినపుడు పాత నీరు కొట్టుకుపోయినట్లు కొత్త కాలక్షేపం వచ్చిపడ్డపుడు పాత విషయాలు ఓ మూలకి కొట్టుకుపోవడం పత్రికల్లో మామూలే గదా!

నిదానంగా మృత్యుంజయుడు పత్రికల్లో కనుమరుగయిపోయాడు.

కొంత కాలం గడిచింది.

ఉన్నట్లుండి మళ్లీ హఠాత్తుగా పత్రికల్లో చోటు చేసుకున్నాడు మృత్యుంజయుడు. నిజజీవితంలో ప్రజల మధ్యనే అజ్ఞాతంగా ఉంటూ అవకాశం దొరికినపుడు దుష్టశక్తుల్ని హతమారుస్తూ అవినీతి అన్యాయాల్ని ఎదుర్కొంటూ అద్భుతాలే చేసి చూపించిన వార్తలు పత్రికల్లో చోటు చేసుకున్నాయి.

బస్! ఖుషీతో నిండిపోయారు మామూలు ప్రజానీకమంతా.

కలికి అవతారం లాంటి మృత్యుంజయుణ్ణి సృష్టించిన ప్రొఫెసర్‌ని వేనోళ్ల పొగిడారు. జేజేలు పలికారు.

దాంతో సరిఫ

కాసింతో కూసింతో దేశం కోసం పాటుపడే వాళ్ళు సైతం పని చేయడం మానేసి నిద్దర్లు మొదలుపెట్టారు. తమ బాధ్యత సైతం మృత్యుంజయుడి భుజస్కంధాల మీదికి తోసేసి బరువు తగ్గించుకున్నారు.

చిగురుటాకు వస్తోంది లెమ్మని మిగిలిన ఆకులన్నీ రాలిపోతే చెట్టు ఎప్పటికి పచ్చగా మారేను?

అంతరి ఆశలూ మృత్యుంజయుని మీదే కేంద్రీకృతమయిపోయాయి. పని చేసే వాళ్లు సైతం పని చేయడం మానేసి మృత్యుంజయుడి గురించిన గొప్పలు చెప్పుకొంటూ క్రియా శూన్యులై ఊహాలోకాల్లో విహరించడం మొదలు పెట్టారు.

కానిఫ

ప్రొఫెసర్ భరద్వాజ అనుకొన్న దొకటి జరుగుతోంది మరొకటి.

మృత్యుంజయుడు మొదట్లో చేసి చూపించినది కేవలం అద్భుతాలు మటుకే - అని ప్రజల్ని మాయ చేయడానికి పత్రికల్లో బహుళంగా కన్పించడానికి మృత్యుంజయుడు వేసిన ఎత్తుగడల్లాగా మాత్రమే అన్పిస్తున్నాయి — ప్రొఫెసర్‌కి.

తనేం పొరపడట్లేదు గదా? తనకుతానే తరచి విశ్లేషించుకున్నాడు ప్రొఫెసర్ భరద్వాజ.

ఇంకొన్నాళ్ళు ఓపిక పట్టాడు. అతి కష్టంమీద మరి కొన్నాళ్ళు నెట్టుకొచ్చాడు.

ఊహుఁ లోకంలో ఏమాత్రం మార్పులేదు.

హత్యలు రక్తపాతాలు దైనిక కృత్యాల్లా విరామం లేకుండా జరుగుతూనే ఉన్నాయి. కులాల పేరిట మతాలపేరిట వర్గాల పేరిట ప్రాంతాల పేరిట దారుణంగా ఎన్నో ఘోరమైన హత్యలు నేరాలు పట్టపగలే జరిగిపోతున్నాయి.

విద్రోహకర శక్తులు యధేచ్ఛగా విహరిస్తూనే ఉన్నాయి.

మతకలహాలు గృహదహనాలు, లూటీలు, కర్ఫ్యూలు నిత్యకృత్యాలయిపోయాయి.

నేరాలు చేసినవాళ్ళు మటుకే రోడ్లమీద తలెత్తుకు తిరుగుతున్నారు.

ప్రొఫెసర్ అంతరంగం వేదనతో నిండిపోయింది.

తాను తలచిందొకటి-జరుగుతున్నది మరొకటి.

చివరికి మృత్యుంజయుడి ఆచూకీ కూడా తెలీకపోయింది ప్రొఫెసర్‌కి.

కన్న కలలన్నీ కుప్పగా కూలిపోయి కాలి మసిబొగ్గు లవుతుంటే భరించలేకపోయాడు. అప్పటికే లోకం ప్రొఫెసర్‌ని పొగడడం మానేసి నిందించడం మొదలుపెట్టింది.

నాల్గురోజుల పాటు పత్రికల కెక్కేందుకు, అచ్చులో తన గొప్పలు చాటుకునేందుకు సకల భారతావనినీ ప్రొఫెసర్ భరద్వాజ తప్పుదారి పట్టించడాని హేళనకు పూనుకుంది లోకం.

నీతికి నిలబడ్డవాడు నిందకుజడిసిపోతాడు.

ఆకలిదప్పులు నశించిపోయాయి ప్రొఫెసర్‌కి.

తన నిండు జీవితం త్యాగం చేసి ఓ మృత్యుంయుణ్ణి సృష్టిస్తే దానివల్ల తనకేం మిగిలిందో తెలీని స్థితిలో అంతులేని నిరాశలో కూరుకుపోయాడు ప్రొఫెసర్.

ఓ మనిషిని జరామరణాలు లేని మృత్యుంజయునిగా చేసిన ప్రొఫెసర్ చిరిగిన దుస్తుల్లో రోడ్డెంట పడ్డాడు-మృత్యుంజయుని ఆరా తీస్తూ...

ఎట్టకేలకు

ఎన్నో వ్యయప్రయాసల తర్వాత మృత్యుంజయుని చిరునామా దొరికింది. తన కోసంగా ప్రత్యేకంగా నిర్మించుకున్న బంకర్‌లో దేశ రాజధానిలో బ్రతుకు వెళ్ళదీస్తున్నాడని తెలిసింది ప్రొఫెసర్‌కి.

మృత్యుంజయుణ్ణి చేసి లోకం బాగు కోసం పంపితే వాడే పిరికిదద్దమ్మ అయి బంకర్లో పొద్దు వెళ్ళబుచ్చుతూ ప్రాణాలు కాపాడుకోవడం...

ఛీ ఛీ అలాంటివాణ్ని మృత్యుంజయునిగా చేయడమే తాను చేసిన ప్రధానమైన తప్పు... తనని తానే అసహ్యించుకొన్నాడు ప్రొఫెసర్.

వేషం మార్చి భాష మార్చి తను ప్రొఫెసర్ నన్న సంగతి ఎవరూగుర్తుపట్టకుండా ఓ అపరాత్రివేళ మృత్యుంజయుడి దగ్గరకు చేరాడు ప్రొఫెసర్.

మందు కొడ్తూ మధ్యలో ఉన్నాడు మృత్యుంజయుడు.

ప్రొఫెసర్‌ని చూసి ఒక్కసారిగా అదిరిపడ్డాడు. మాటా పలుకూ లేకుండా ప్రత్యక్షమైన ప్రొఫెసర్‌ని చూసి సిగ్గుతో తల దించుకొన్నాడు.

'చీకట్లో పడి కొట్టుకుంటూ వెలుగు సైతం చూడ్డానికి విముఖత చూపిస్తున్న జనాల్ని జాగృతం చేస్తానని నిన్నుపంపితే నువ్విక్కడ చీకట్లో పడి నిద్దట్లో కుళ్ళిపోతున్నావా...'

ప్రొఫెసర్ గుండె లోతుల్లోంచి బయటపడ్డ ఆక్రోశాన్ని అతన్లో రగులుతున్న ఆవేదననీ సులభంగానే అర్థం చేసుకోగలిగాడు మృత్యుంజయుడు.

'నువ్వో పిరికివందవి నీకు చావులేకుండా చేసి నేను పెద్ద దేశద్రోహమే చేశాను. దానికి అంతులేని శిక్ష అనుభవించి తీరాలి...'

ప్రొఫెసర్ అలా బాధపడటం తను భరించలేనన్నట్లుగా ఏదో చెప్పబోయాడు మృత్యుంజయుడు.

నో...నువ్వింకేం చెప్పనక్కర్లేదు-నువ్వేదో ఈ దేశాన్ని ఉద్ధరించే కథానాయకుడి వవుతావనుకున్నాను కాని ఇలా హేయంగా నీచంగా మారి...

ఇందులో నా తప్పేం లేదన్నట్లుగా తల అడ్డంగా ఊపాడు మృత్యుంజయుడు.

ఏమిటి ఇది ద్రోహం కాదా... ఇందులో నీతప్పేమీ లేదా? ఆవేశంగా ప్రశ్నించాడు ప్రొఫెసర్.

ధైర్యం చేసి గొంతు విప్పాడు మృత్యుంజయుడు.

'ఇందులో నా తప్పేంలేదు సార్... నేను ప్రతిక్షణం అక్షరాలా మీరు ఆదేశించినట్లుగానే నడుచుకోవాలనుకున్నాను... మీ లక్ష్యానికి అనుగుణంగానే దుష్టరాజకీయాల్ని నాశనం చెయ్యాలనుకున్నాను... కాని చివరికి నాకేం మిగిలింది... వైరస్ తప్పింది'

వైరస్ ఏమిటి? ప్రొఫెసర్ భృకుటి ముడివడింది.

హుఁ వైరస్ అంటే ఇది ఆషామాషీ వైరస్ కాదు- పొలిటికల్ వైరస్... వైరస్ 'పి'... నందిని, తిమ్మిని బమ్మిని చేయగల వైరస్... ప్రస్తుతం నేను ఆ పొలిటికల్ వైరస్ బారినపడి శక్తిహీనుణ్ణయిపోయి సకల అవలక్షణాలకి బానిసనయి బ్రతుకుతున్నాను...

అయోమయంలో పడిపోయాడు ప్రొఫెసర్.

'అవును సార్ మీది చదువుకున్న తెలివి... కాని వాళ్ళదో బ్రతకనేర్చిన తెలివి ... చదువు తక్కువైనా వాళ్ళకి తెలివెక్కువ ... మీరెన్ని సంవత్సరాలయితే నా కోసం శ్రమించి నన్ను మృత్యుంజయుణ్ణి చేశారో అన్ని రోజుల్లోనే వాళ్ళు నన్ను నిస్సహాయుణ్ణి చేశారు...'

ప్రొఫెసర్‌కి గుండె కొట్టుకోవడం ఎక్కువయిపోయింది.

'ఈ పొలిటికల్ వైరస్ నన్ను పట్టిన పెట్టుకుంది.. ఇప్పుడు నేను మీ మృత్యుంజయుణ్ణి కాదు సార్... సకల అవలక్షణాలకి బానినయిపోయి ఈ బంకర్లో ప్రాణం కాపాడుకొంటున్న పిరికి పందని సార్...'

బావురుమంటూ ఏడుస్తున్న మృత్యుంజయుణ్ణి ఓదార్చను కూడా శక్తిలేకపోయింది ప్రొఫెసర్‌కి.

గుండె నాళాల్లో ఏదో అడ్డంగా నిలిచినట్లు రక్త ప్రవాహం పెరుగుతున్నట్లు కళ్ళు తిరుగుతున్నట్లు అన్పిస్తుండగా ప్రక్కనే ఉన్న సోఫాలో కూలబడి పోయాడు ప్రొఫెసర్.

'అంతే కాదు సార్ .. ఇంకొన్నాళ్ళు ఆగితే నాకూ సంతానం కలగొచ్చు అపుడు వాళ్ళు కూడా చిరంజీవులుగా చావులేనివారుగా పుట్టే ప్రమాదం ఉంది. వాళ్ళకీ ఈ వైరస్ వారసత్వంగా సంక్రమిస్తుంది ... ఇలా నాకు సంతానం .. నా సంతానానికి సంతానం పుట్టూ పోతే 'ఒక నాటికి చావనేది లేని వైరస్ సి' బాధితులుగా నా వారసులు మిగిలిపోవచ్చు ... అప్పుడిక దేశాన్ని బాగుపరిచే కాళ్ళకంటే కొల్లగొట్టే వాళ్ళే ఎక్కువయిపోవచ్చు...

* * *

అందుకే సార్! చావు లేకుండా చేసిన ఆ చేతుల్తోనే నాకు మరణభిక్ష ప్రసాదించండి'

చిన్నపిల్లాడిలా కంట నీరు పెట్టుకుని తన చావు తానే కోరుకుంటున్న మృత్యుంజయుణ్ణి చూశాక తను చేసిన పని ఎంత తొందరపాటు చర్యో తెలిసి రాసాగింది ప్రొఫెసర్‌కి.

ఇలాంటివేవో జరుగుతాయని ముందుగా ఊహించలేకపోయినందుకు వ్యథ చెందడం మొదలుపెట్టాడు.

ఓ మనిషికి చావులేకుండా చేసి ఆ మృత్యుంజయుడి ద్వారా దేశాన్ని బాగుపర్చాలనే భ్రమల్లో మునిగి తేలిన ప్రొఫెసర్‌లో మళ్ళీ ఆలోచన మొదలైంది.

ఆ రాత్రంతా అక్కడే గడిచిపోయింది. ప్రొఫెసర్ కంటి మీద కునుకు లేదు వేకువజాము ప్రాంతంలో శెలవు తీసుకుని వెనుదిరిగాడు.

చివరిగా ఓ చిన్న మాట చెప్తానన్నాడు మృత్యుంజయుడు. మౌనంగా వింటూ నించున్నాడు ప్రొఫెసర్. ఇప్పుడు మన దేశానికి కావలసింది నాలాంటి చావులేని వాళ్ళు కాదు సార్.... చావుని గెలవగలిగే వాళ్ళు ... చావంటే లెక్కలేని యువకులు కావాలి...అలాంటి వాళ్ళే ధీరులు ... వీరులు ... నిప్పుకణికలు అవునుసర్! కేవలం అలాంటి యువతరం వల్లనే మళ్ళీ మన దేశం సస్యశ్యామలం కావాలి... అంతేగాని చావులేకుండా చేసి నా లాంటి వాళ్ల వలన ఎవరైనా సాధించగలిగేది శూన్యమే...

'ఇంత మాత్రం తను ముందే ఎందుకు ఆలోచించలేకపోయాడు' ప్రొఫెసర్‌ని కలవరపెట్టూనే ఉండిపోయిందా విషయం.

నీతి కోసం -

నిజం కోసం-

న్యాయం కోసం-

చావుకి సైతం తెగించి పోరాడే యువతరమంటే ఈ వైరస్ 'పి'కి గుండెదడ...

అందుకే సార్...

అగ్నికణాల్లాంటి యువకుల్ని మేల్కొలపండి

చిచ్చర పిడుగుల్ని చేసి వదలండి...

అలాంటి వాళ్ళే సార్ ఇప్పుడు మన దేశానికి కావలసిన వాళ్ళు... అనుభవంతో కూడుకున్న స్పష్టమైన ఆలోచనల్లో ఊగిపోతున్న మృత్యుంజయుడిలో...

ఒక వివేకానందుడు

ఒక సుభాష్ చంద్రబోసు

ఒక అల్లూరి సీతారామరాజు దర్శనమిస్తుండగా

మళ్ళీ లోకం కేసి ప్రస్థానం సాగించాడు ప్రొఫెసర్ భరద్వాజ సైంటిస్టుగా కాదు..

భారత జాతి యువతరాన్ని మేల్కొలిపేందుకు పూనుకొన్న చైతన్య శక్తిగా.